# నీటి తుంపర

## -చందు సోంబాబు అంజిన

తనెవరో ఆమెకి తెలీదు.

తన వాళ్లెవరో అసలే తెలీదు.

వయసు పాతిక లేక ముప్పైలోపు.

అది చూసే వాళ్లకి తెలుసు తప్ప దానికి వయసనేది వుంటుందన్న సంగతి తెలీదు.

మనిషి ఛామనచాయ. పెద్ద కళ్లు, సన్నగా, పొడుగ్గా వుంటుంది. జిబిరి జుత్తు, అస్తవ్యస్తంగా వున్న దుస్తులు మాసిపోయి కంపు కొడుతున్నాయి.

అది వీధుల్లో తిరుగుతుంటే కొన్ని ఆకలి చూపులు తన వంటిని గుచ్చి గుచ్చి చూస్తుంటాయని దానికి తెలీదు.

ఆకలేస్తే చేయి సాచి అడుక్కుంటుంది. ఆకలి లేనప్పుడు చేతిని సాచి ఎరగదు.

ఖాళీగా వున్నప్పుడు, తోచనప్పుడు నాయుడుగారింటి అడుగుమీద కూర్చుంటుంది. రాత్రిళ్లు అక్కడే పడుకుంటుంది.

దానికి పేరు లేదు.

నాయుడుగారింట్లో వాళ్లు 'బాలమ్మ' అని పిలుస్తుంటారు.

సాయంత్రం నించీ చేయి సాచినా ఎవరూ సాయం చేయలేదు.

ఆ రోజంతా తిండి దొరకలేదు. దాహంగా వుంది. నాలుకతో పెదాలను తడుపుకుంది.

చీకటి పడుతోంది. దిగులుగా కాళ్లీడ్చుకుంటూ గుడి పక్కనే వున్న పంపు దగ్గరికి పోయి నీళ్లు తాగింది.

చలిగాలి తిరిగింది. అక్కడికి వందగజాల దూరంలో కాలేజీ వుంది. అక్కడ సందడిగా కనిపించింది.

గేటు ఎదురుగా వున్న చెట్టు కింద కూర్చుంది. పక్కనే పాత డాబా ఇల్లు ఎన్నో ఏళ్లనాటిది కూలిపోవడానికి సిద్ధంగా వుంది. ఒకప్పుడు అందులో చంద్రం బాబాయ్ హోటల్ వుండేది. కాలేజీ కుర్రాళ్లందరికీ అతను 'బాబాయ్'.

ఇప్పుడు ఆ బాబాయ్ లేడు. ఆ హోటలున్న ఇల్లు శిథిలావస్థలో ఉంది.

అందరూ లోపలకెళ్లే హడావుడిలో వున్నారు. బయటకు వచ్చేటప్పుడన్నా తనకి కనీసం చాయ్ డబ్బులన్నా దొరుకుతాయన్న ఆశతో అక్కడే కూర్చుంది బాలమ్మ.

చీకటి కమ్ముకొచ్చింది. కాలేజీలో దీపాల వెలుగుతప్ప రోడ్డుపైన చీకటిగా వుంది. బాలమ్మ చిన్నా చితకా చితుకుల్ని ఏరి కుప్పగా పోసింది. చలి కాసుకోవడానికి చిన్న మంటవేసుకోవడానికి దాని చిరుప్రయత్నమది. పక్కనే వున్న సిగరెట్ దుకాణం దగ్గరకెళ్లి వెలుగుతున్న చిమ్నీలో చిన్న కాగితాన్ని వెలిగించి చితకుల్ని రాజేసింది.

చలిమంట వెలిగింది. ఆ మంట వెలుగులో బాలమ్మ మొహం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ముఖంలో ఏ విధమైన భావాలు కనిపించడంలేదు.

కాలేజీలోంచి మైకులో లోపల జరుగుతున్న కార్యక్రమం వినబడుతోంది.

రోడ్డుమీద జనసంచారం లేదు.

సరిగ్గా అప్పుడు ముగ్గురు మనుష్యులొచ్చి దానిముందర నించున్నారు.

వాళ్లకేసి ఆశగా చూసింది బాలమ్మ. ఆ ముగ్గురూ దాని చూపుల్ని చదివారు. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకుని చిన్నగా నవ్వుకున్నారు.

సిగరెట్ బడ్డీ కట్టేస్తున్నాడు షాపువాడు.

రోడ్డుమీద తమని గమనించేవాళ్లెవరూ లేకపోవడంతో అందులో ఒకడు సైగచేసి పిలిచాడు.

బాలమ్మ లేచి నించుంది.

కూలిపోవడానికి సిద్ధంగా వున్న డాబా ఇంటి వెనక్కి దాన్ని తీసుకెళ్లాడు. మిగిలిన ఇద్దరూ కూడా అనుసరించారు.

గొంతులో మాటల్ని పెగుల్చుకుంటూ జాలిగా అంది ''ఆకలి''.

ఆ ముగ్గురిలో సైగచేసి తీసుకొచ్చిన వాడు వెకిలిగా నవ్వాడు.

''మాకూ ఆకలిగా వుంది'' అన్నాడు.

ఆ మాటలు విని ఆశ్చర్యంగా చూసింది, ఆలస్యం చేయకుండా దాని చేయి పట్టుకుని తుప్పల పక్కకి తీసుకెళ్లాడు.

ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఏ ఘోరం జరిగినా నరమానవుడికి తెలీదు.

దాన్ని పడుకోబెట్టి రొమ్ములమీద చేతులు వేశాడు.

''ఆకలి'' అంది మళ్లీ.

''డబ్బులిస్తాలే'' నిర్లక్ష్యంగా అంటూ దాన్ని ఆక్రమించుకున్నాడు.

వాడు తన జీవితాన్ని నాశనం చేస్తున్నాడని కానీ శీలం మంట కలిసిపోతోందని కానీ దానికి తెలీదు. ఏదో అనుభూతి. ఇంతవరకూ తెలీని 'హాయి' తెలుస్తున్నాయి దానికి.

అతని తర్వాత ఇంకొకడు. ఆ తర్వాత మూడోవాడు.

తిరిగి మళ్లీ...

ఒళ్లు హూనం అయిపోతున్నా ఇంకా ఏదో కావాలనిపిస్తోంది ఆ అమాయకురాలికి.

''బాగుందా?'' అడిగాడు వాడు.

''ఊఁ''

''ఏయ్! దాంతో కబుర్లేంటి? రా'' గదిమాడు ఆ గ్రూపులో ఒకడు.

''దాన్ని విడిచిపెడితే మన గురించి ఎవరికన్నా చెబుతుందేమో?'' భయాన్ని వెళ్లగక్కాడు మరొకడు.

ఆ మాటలు విన్న మూడోవాడు ఓ గనేట్ రాయిని ఎత్తుకొచ్చాడు.

''ఏం చేస్తున్నావ్?'' అడిగాడు మొదటివాడు.

''దాన్ని చంపేస్తే గొడవుండదు''

''చంపితేనే గొడవ. పోలీసుల దర్యాప్తులో దొరికిపోతాం''

''మరి?''

''అది పిచ్చిమొహంది. మొదటి ఛాన్స్ మనమే కొట్టేశాం. అది ఎవర్తోమా చెప్పలేదు. మనం తిరిగి ఇటు ఎటూ రాము. కనుక మన దారిన మనం వెళ్లిపోదాం'' అంటూ జేబులోంచి ఓ పది కాగితం తీసి దాని చేతిలో పెట్టాడు.

దాని మొహం ఆనందంతో వెలిగిపోయింది.



వాళ్లు వెళ్లిపోయారు.

★★★

ఎక్కడ కూర్చున్నా బాలమ్మకి ఆ ముగ్గురే గుర్తుకొస్తారు. తనకెంతో హాయిని కలిగించారు వాళ్లు. అలాంటి సుఖం వాళ్లు మాత్రమే ఇవ్వగలరని దాని నమ్మకం. లేకపోతే ఇంకెవరూ తనని పిలవరే?

వాళ్లు కనబడితే బాగుండుననిపిస్తోంది దాని పిచ్చి మనసుకి.

రోజులు గడుస్తున్నాయి. అది పిచ్చిగా వాళ్లకోసం చూస్తోంది. కాలేజీ దగ్గర కెళ్తోంది. ఆ తుప్పల దగ్గరికి పోయి చూస్తుంది. దాని అన్వేషణ సాగుతుండగానే శరీరంలో మార్పు... కడుపు పెరుగుతోంది.

నాయుడుగారు ముక్కున వేలేసుకున్నారు.

''ఏమిటే ఇది?'' అడిగారు.

అది నవ్వింది. ఆయనకి కోపం వచ్చింది.

నాయుడుగారి భార్య ''పాపం... అమాయకపు దాన్ని చేసి ఎవడో కక్కుర్తి పడ్డాడు''

''అయితే మాత్రం?'' రుసరుసలాడారు నాయుడుగారు.

''చూడండి. చదువుకున్నవాళ్లే ప్రేమ మోజులో పడి కాలు జారుతున్నారు. అది అభంశుభం తెలీని వెర్రిది. బహుశా చేసింది తప్పని కూడా దానికి తెలిసి వుండదు. కోపగించి ఏం చేస్తాం?'' అంది.

''పురుడుపొయ్యి''

''ఆడమనిషి ఎలాంటిదైనా పురిటి సమయంలో సాటి ఆడది సాయపడకుండా వుండదులెండి'' అంది.

★★★

ముక్కున వేలేసుకునేవాళ్లు, చీదరించుకునే వాళ్లు...అడుక్కు తినేదానిక్కూడా...ఛీ...ఛీ...

సమాజమంటే అదే!

అడుక్కునేదానికి మనసుండకూడదు.


కోరికలుండకూడదు.


ఎవరి దగ్గరా పడుకోకూడదు.

దానికి కడుపు రాకూడదు.

''చూడబోతే దానికి కడుపు రావడానికి నేనే కారణం అనేటట్టున్నారు జనం'' నాయుడుగారు దిగులుగా అన్నారు భార్యతో.

''అనుకోనివ్వండి. ఎవరి పాపం వాళ్లది'' అంది




అన్నపూర్ణమ్మ.

అలాంటి సమాధానం భార్య నోటి నుంచి విన్నాక ఆమెకి చేతులెత్తి నమస్కరించాలనిపించిందాయనకి.

★★★

బాలమ్మకి నొప్పులు మొదలయ్యాయి. దాన్ని రిక్షాలో ఎక్కించి గవర్నమెంటు హాస్పిటల్లో చేర్పించారు నాయుడుగారి కుటుంబం.

దానికి నార్మల్ డెలివరీ జరిగింది. కొడుకు పుట్టాడు. ఏడోరోజు దాన్ని పంపించివేశారు. కొడుకుని భుజాన వేసుకుని రోడ్డు మీదకి వచ్చింది బాలమ్మ. దానికి ఓ బంగారుకొండ దొరికినంత సంబరంగా వుంది.

నాయుడుగారి భార్య దానికొన్ని పాత గుడ్డలు ఇచ్చింది.

బిడ్డ నెత్తుకుని అది కాలేజీ దగ్గరకెళ్తోంది. దాని చూపులు వచ్చిపోయేవాళ్లపైనే నిలుస్తాయి.

తన జీవితంతో ఆటలాడుకున్నారు వాళ్లని తెలీదు. వాళ్లు చేసిన నిర్వాకానికి ప్రతిఫలం చంకలో బిడ్డని తెలీదు. చంకలో బిడ్డ ఏడ్చినప్పుడు అర్ధనగ్నంగా బయటపడి కనిపించే రొమ్ముని బయటకి లాగి ఏ అరుగుమీదనో కూర్చుని పాలు తాగిస్తుంది. దానికి ఆకలేస్తే చేయి సాచి అడుగుతుంది. అదే దినచర్య అయిపోయింది బాలమ్మకి.

ఈమధ్య పగలంతా ఎక్కడెక్కడో తిరిగి తిరిగి వస్తుంది. నాయుడుగారి భార్య అడిగితే అది నవ్వుతుంది. అంతకుమించి ఎక్కడ తిరిగిందీ ఎందుకు తిరిగిందీ అది చెప్పదు. చెప్పడంరాదు.

ఇంట్లో వాళ్ల భోజనం అయిపోతే మిగిలిందేమన్నా వుంటే పెడుతుందా ఇల్లాలు. అది అరుగుమీదే తిని పడుకుంటుంది.

★★★

అక్కడ జనం గుమిగూడి ఉన్నారు.

అక్కడికెళితే ఏమన్నా దొరుకుతుందేమోనని ఆశగా అటు కదిలింది బాలమ్మ.

జనం... దాన్ని పట్టించుకోలేదు. బెరుగ్గా చూశారు. వాళ్లల్లో వాళ్లు మాట్లాడుకుంటున్నారు. బాలమ్మ జనాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్లింది.

దూరంగా స్కూటర్ పడిపోయి ఉంది. మగమనిషి నేలపై పడున్నాడు. రక్తం... కాళ్లనుంచి, చేతుల నుంచి, నుదురునుంచి కారుతోంది. ఒకామె ఏడుస్తోంది.

ఆడా, మగా, చిన్నా పెద్దా అందరూ...

''హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి''

''అబ్బే... పోలీసులు రాందే హాస్పిటల్లో అడ్మిట్ చేసుకోరు''

''ఆలస్యం అయితే ప్రాణానికే ముప్పు రావచ్చు''

ఆ మాటలు విన్నది ప్రమాదానికి గురైన వ్యక్తి భార్య. ఆమె వెక్కిళ్ల స్థాయి నుంచి ఏడుపుని పెంచింది.

''దాహం...దాహం'' మెల్లగా, దూరంగా అతని గొంతులోంచి మాటలు... కంఠం అదురుతోంది.

''అయ్యో! ఈ చుట్టుపక్కల నీళ్లు దొరకవు. ఎలా?''

''వెళ్లి ఎవరన్నా సోడా తీసుకురండి''

పక్కనే చాలా స్కూటర్లు, సైకిళ్లు ఆగి వున్నాయి. ఎవరూ కదల్లేదు.

బాలమ్మ గుడ్లప్పగించి చూస్తోంది. దాన్నెవరూ పట్టించుకోవడంలేదు.

''నీళ్లు...నీళ్లు...'' నీరసంగా నూతిలోంచి వస్తున్నట్టు మాటలు.

బాలమ్మ రెండడుగులు ముందుకేసింది.

''ఏయ్! నువ్వెక్కడికి?'' కసిరారెవరో.

ఆ వ్యక్తికేసి ఓసారి నిర్లిప్తంగా చూసింది బాలమ్మ.

ఆ మనిషి మాటల్ని పట్టించుకోకుండా రెండడుగులు ముందుకేసింది. చంకలో బిడ్డని పాత బట్టల పొత్తిలో వుంచి కింద పడుకోబెట్టింది.

ప్రమాదానికి గురై ప్రాణా పాయ స్థితిలో వున్న ఆ వ్యక్తిని పసిబిడ్డలా ఒడిలోకి తీసుకుని అతని తలని ఎత్తి రొమ్ముని బయటకి లాగి అతని నోటికి అందించింది.

కళ్లు తెరిచి చూసే శక్తి కూడా లేని అతను ఆమె రొమ్ముని చప్పరిస్తుంటే చూస్తున్న జనం విస్తుబోయారు.


ఆ పనిని చేయలేకపోయిన అతని భార్య తల వంచుకుంది.

అఖండ జలధి నుంచి ఎగసి పడే కెరటాలు ఒడ్డుని తాకినప్పుడు నీటి తుంపరలెన్నో తీరాన ఇంకిపోతుంటాయి.

అలాంటి నీటి తుంపర లాంటిది బాలమ్మ.

కానీ ఆ నీటి తుంపర మనసు ఆ మహాసముద్రం లాంటిదని దానికి తెలీకుండానే చాటి చెప్పుకుంది.

★



## బ్రహ్మానందానికి పోటీ?

బ్రహ్మానందం కెరీర్‌గ్రాఫ్ మెల్లగా తగ్గుముఖం పట్టిందని సినీ పరిశ్రమలోని జనం అంటున్నారు. మొన్నటికిమొన్న జరిగిన 'బ్రహ్మానంద కుంభకోణం'లో తోటి కమెడియన్స్ అందరికీ శత్రువయిపోయిన బ్రహ్మానందాన్ని తమ చిత్రాల్లో బుక్ చేస్తే మిగిలిన కమెడియన్స్ తమకు సహకరిస్తారో లేదోనని కొంతమంది నిర్మాత, దర్శకులు భయపడుతున్నారట. నిజానికి, కమెడియన్స్ అందరూ తమ పక్కన బ్రహ్మానందం నటించేప్పుడు మహా ఇబ్బంది పడిపోతున్నారని యూనిట్ జనం చెప్పుకుంటున్నారు. ఇలాంటి ఇబ్బందికరమైన వాతావరణం నుండి తప్పించుకునేందుకే కొందరు కమెడియన్లు బ్రహ్మానందం బదులు యం. యస్.నారాయణను సజెస్ట్ చేస్తున్నారట. యం. యస్.నారాయణ బ్రహ్మానందం అంత గొప్పనటుడు కాకపోవచ్చుగానీ, మంచి నటుడేనని పాత్రకు న్యాయం చేస్తాడని వాళ్ళు చెప్తున్నారట. ఏమయితేనేం బ్రహ్మానందం చేసిన తప్పిదం, యం. యస్.నారాయణకు మేలు చేసింది. వచ్చిన నంది అవార్డ్ యం. యస్.నారాయణ కెరీర్‌కి మరింతా మేలు చేస్తుంది.

-జె.వి.బాబు